వివాహ వేడుకకు ఆహ్వానం

ఈనెల 20న నగరంలోని హైటెక్స్ కన్వెన్షన్‌లో జరిగే తన కూతురు అలేఖ్య రెడ్డి వివాహానికి రావాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆహ్వానించారు. గురువారం బంజారాహిల్స్ నందినగర్‌లోని వారి నివాసంలో కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. - కాప్రా

స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేయాలి

మూడోరోజు కొనసాగిన డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

నారపల్లి సబ్‌రిజిస్టేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖరులు

పోచారం,ఏప్రిల్ 17: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్‌ను తొలగించి పాత పద్ధతి ద్వారనే రిజిస్టేషన్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్ చేశారు. పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే డాక్యుమెంట్ రైటర్లు గురువారం మూడోరోజు ఆందోళన కొనసాగించారు. తక్షణమే స్లాట్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో..

మేడ్చల్: స్లాట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు చేపట్టిన ఆందోళన కొనసాగింది. గురువారం మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు మోకాళ్ల మీద నిలబడి నిరసన తెలిపారు.

రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట..

బండ్లగూడ: ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట గురువారం డాక్యుమెంట్ రైటర్లు ధర్నా నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధిలో తెలంగాణ భేష్

బీహార్ ప్రజాప్రతినిధుల బృందం

పెద్దతూప్ర పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న బీహార్ ప్రజాప్రతినిధుల బృందం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17: గ్రామాల అభివృద్ధిలో తెలంగాణ భేష్ అని బీహార్ రాష్ట్ర ప్రజాప్రతినిధుల బృందం మెచ్చుకున్నట్లు శంషాబాద్ మండల అధికారులు వివరించారు. గురువారం ఎన్ఐఆర్‌డీ టీమ్ ఆధ్వర్యంలో బీహార్ రాష్ట్రంలోని 50 మంది సర్పంచ్‌లు శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామంలో పల్లెప్రకృతి వనం, నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం, నర్సీలు, వైకుంఠ ధామాలు, తాగునీటి కోసం మిషన్ భగీరథ పథకం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇక్కడి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టిన పనులు అద్భుతంగా ఉన్నాయని వివరించారు. బృందం సభ్యులతో శంషాబాద్ ఎంపీడీవో మున్ని, మాజీ ఎంపీపీ జయమ్మ, ఇతర అధికారులు ఉన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి

సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌ఓ అనురాగ్ జయంతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పోలింగ్, కౌంటింగ్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ఉదయం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓలకు రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డాక్టర్ సునంద రాణి, మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మీ, ఈఈ మమత, పోలింగ్ పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సర్వీస్ క్యాంపునకు విశేష స్పందన

సిటీబ్యూరో, ఏప్రిల్17, (నమస్తే తెలంగాణ): వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గురువారం విజయనగర్ కాలనీలో బీఎస్‌ఎన్‌ఎల్ ఏర్పాటు చేసిన వినియోగదారుల సర్వీస్ క్యాంపునకు విశేష స్పందన వచ్చింది. బీఎస్‌ఎన్‌ఎల్ హైదరాబాద్ సెంట్రల్ డిప్యూటి జనరల్ మేనేజర్ రామానందం మాట్లాడుతూ..వినియోగదారుల సమస్యలు, సలహాలు పరిగణలోకి తీసుకొని వారికి మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఈ సర్వీస్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర నెట్వర్క్‌లతో పోలిస్తే బీఎస్‌ఎన్‌ఎల్ తక్కవ ధరలకే అత్యుత్తమ సేవలు అందిస్తూ ప్రజాదరణ పొందుతుందని, త్వరలోనే 4జీ సేవల విస్తరణ జరుగుతుందన్నారు. సేల్స్ ఏజీఎం శ్రీనివాస్, సైఫాబాద్ ఏజీఎం వసంత, చీఫ్ అకౌంట్ అధికారి కళ్యాణి పాల్గొన్నారు.

బౌరంపేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న బౌరంపేట బీఆర్‌ఎస్ పార్టీ నేతలు

దుండిగల్, ఏప్రిల్ 17: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ లోనీ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ భౌరంపేట్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం బీఆర్‌ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజును గండిమైసమ్మలోని తెలంగాణ భవన్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారంలో ఒక్క రోజు కూడా సరిగ్గా సరఫరా కావడం లేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి ,మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి , శేఖర్ ముదిరాజ్, వీరేశ్ , గోపాల్‌తోపాటు,బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన పండ్లు, పాడైన సలాడ్

- అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన పండ్లతో జ్యూస్ తయారీ
- ఈగల మోత, బొద్దింకల దాడి
- లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- జ్యూస్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు
- నిర్వాహకులకు నోటీసులు

అమీర్‌పేట్‌లో అధికారులు దాడులు నిర్వహించిన జ్యూస్ దుకాణం. (ఇన్‌సెట్‌లో) షాప్‌లోని ఐస్ బాక్స్‌లో ఎలుకలు, పురుగులు, జ్యూస్ జార్లపై ఈగలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): జ్యూస్ ఆరోగ్యకర పానీయం.. యాంటీ ఆక్సిడెంట్లు, మైక్రోన్యూట్రియెంట్లు, పాలీఫెనాల్స్, అంథోసైనిన్‌లు అధికంగా ఉండటం వలన ఇది ఆరోగ్యకమైన పానీయంగా పరిగణించబడుతుంది. ఎన్నో ఆరోగ్యకర ప్రయోజనాలున్న ఈ జ్యూస్‌లను చాలా మంది రోడ్ల వెంట ఉండే జ్యూస్ బండ్ల దగ్గర, కాలనీల్లో జ్యూస్ సెంటర్ల వద్ద ఇష్టంగా తీసుకుంటుంటారు. . దీనిని అసరాగా చేసుకుంటున్న కొందరు జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా ఆర్యోగ ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన పండ్లతో జ్యూస్‌లు సిద్ధం చేస్తున్నారు. జ్యూస్‌లో వినియోగించే పాలు, ఐస్‌లు ప్రమాదకరంగా ఉంటున్నాయి. ఆమీర్‌పేట కేంద్రంగా పలు జ్యూస్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించంగా కళ్లు చెదిరే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఏ ఒక్క సెంటర్ నిర్వాహకులు పరిశుభ్రత లేకుండా జ్యూస్‌లను కస్టమర్లకు ఇస్తున్నట్లు తేల్చారు. తనిఖీల్లో భాగంగా వెంగళ్‌రావు నగర్ కాలనీలోని ఏ 1 ఫ్రూట్ అండ్ జ్యూస్ షాప్‌లో అడుగడుగునా అపరిశుభ్రమైన వాతావరణంలో జ్యూస్‌ల తయారీ ఉన్నట్లు గుర్తించారు. తయారీ ప్రాంతంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. రిఫ్రిజిరేటర్ తుప్పు పట్టి ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా ఇనుప కత్తులు పూర్తిగా తుప్పు పట్టినట్లు , చెత్త బుట్టల తెరిచి ఉండటంతో ఈగలదాటి ఉన్నట్లు తేల్చారు. అమీర్‌పేట ప్రధాన రహదారిలో వింటారా కాంప్లెక్స్‌లోని కోకనట్ జ్యూస్ బార్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిన పండ్లు,తయారీ ప్రాంతంలో ఏ మాత్రం శుభ్రత లేదని తేల్చారు. అనంతరం అమీర్‌పేటలోని ప్రభుత్వ దవాఖానా ఎదురుగా కేజీఎన్ జ్యూస్ సెంటర్ నిర్వాహకులు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్ చాలా అపరిశుభ్రమైన స్థితిలో ఉందని, జ్యూస్ తయారీ చేసే ప్రాంతంలో ఈగల మోత ఉన్నట్లు తేల్చారు. ఫ్రిజ్‌లో పాడైన ఫ్రూట్ సలాడ్‌ను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అమీర్‌పేటలోని తిరుమల టవర్స్‌లోని నేచురల్ ఫ్లేవర్‌లో అపరిశుభ్రత వాతావరణంలో ఉన్నట్లు తేల్చారు. పైనాపిల్ క్రష్, బ్లాక్ కరెంట్ క్రష్, అరెంజ్, బ్లూక్రాకో, అరటిపండ్లు తదితర పండ్లు పాడైనట్లు గుర్తించారు. సోడా బాటిళ్లపై లేబుల్ సరిగా లేవని, ఫ్రిజ్‌లో బొద్దింకలు ఉన్నాయని, పనిచేసే సిబ్బంది ఎలాంటి పరిశుభ్రమైన నియమ నిబంధనలు పాటించలేదని తేల్చారు. ఆనంతరం ఆమీర్‌పేట మెట్రో పిల్లర్ నంబర్ 1443 బొంబాయి జ్యూస్ సెంటర్‌లో శుభ్రత లేదని తేల్చారు. కుళ్లిన పండ్లు, కూరగాయాలు ఉన్నాయని, ఫ్యాన్లు దుమ్ము పట్టి ఉన్నాయని, గుర్తించారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని, శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు స్పష్టం చేశారు.

అమర్నాథ్ యాత్రికులకు..

గాంధీలో ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 17 : హిమాలయ పర్వతాల పై ఉన్న అమర్నాథ్ యాత్రకు వెళ్లే వారికి సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో ఫిట్నెస్ సర్టిఫికెట్లను ఉచితంగా జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఏప్రిల్ 21వ తేదీ నుంచి ప్రతి సోమ, బుధ, శుక్ర వారాలలో ఉదయం 10:30 గంటలకు ప్రధాన భవనం, మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డ్స్‌డిపార్ట్మెంట్‌లో ఈ సర్టిఫికెట్ పొందవచ్చు. ఇందుకోసం దరఖాస్తు తో పాటు రక్త పరీక్షలు, చాతి ఎక్స్‌రే, బ్లడ్ గ్రూపు పరీక్షల రిపోర్ట్‌లను తీసుకుని రావాలని, 50 ఏళ్ల వయస్సు పైబడిన వాళ్లు తప్పనిసరిగా రెండు మోకాళ్ల ఎక్సరేలను తీసుకొని రావాలని అధికారులు తెలిపారు. సర్టిఫికెట్ల జారీ కోసం డీఎం నియమించిన వైద్యులు డాక్టర్ బీ కిరణ్ (ఆర్థోపెడిక్), డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి (కార్డియాలజీ), డాక్టర్ భానుప్రియ (పల్మానాలజీ), డాక్టర్ కృష్ణ నాయక్ (జనరల్ మెడిసిన్) వైద్యుల బృందం సిద్ధంగా ఉంటారని తెలిపారు. సర్టిఫికెట్ల జారీ పూర్తిగా ఉచితమని.. ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని అమర్నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని గాంధీ ఆసుపత్రి అధికారులు తెలిపారు.

హామీలపై ప్రశ్నించడం తప్పా?

- రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రసంగానికి అడుగడుగునా అడ్డుపడిన కాంగ్రెస్ నేతలు
- ప్రతిగా బీఆర్‌ఎస్ నేతల నినాదాలు

కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన ఆపార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రశ్నించడం తప్పా అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని సబితారెడ్డి విమర్శించారు. గురువారం కందుకూరు మండల పరిషత్ సమావేశపు హాలులో 105 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తుండగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన హామీలపై విమర్శలు చేయడంతో పాటు ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుపడటంతో.. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇదికాస్తా ఒకరిపై ఒకరు చేయి చేసుకునే స్థాయికి దారి తీసింది .ఇరు వర్గాలను పోలీసులు సముదాయించి సమావేశం హాలులో నుంచి బయటకు పంపించారు. అనంతరం చెక్కుల పంపిణీ యథావిధిగా కొనసాగింది.

ప్రభుత్వానికి భంగపాటు తప్పదు..

అనంతరం కందుకూరులో ఎమ్మెల్యే సబితారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతుబంధు రెండు పంటలకు ఎగనం పెట్టిందని విమర్శించారు. పేదింటి పిల్లల తల్లి దండ్రులకు భారం కావద్దని మాజీ సీఎం కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి అండగా ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తులం బంగారం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు .ఇప్పుడు చెక్కులు ఇస్తున్న వారితో పాటు ఇకమీదట కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి త్వరలో ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు.. సురసాని సురేందర్ రెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, సామ మహేందర్ రెడ్డి, సురసాని రాజశేఖర్ రెడ్డి , మేఘనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, ఆనంద్, దేవీలాల్ నాయక్, ఇందిరమ్మ దేవేందర్, మాజీ సర్పంచ్‌లు గోపాల్ రెడ్డి, జ్యోతి , జంగయ్య ,చంద్రశేఖర్, పుల్లారెడ్డి, డైరెక్టర్ ఆనంద్, మాజీ డైరెక్టర్ పారిజాతం, దేవిలాల్ నాయక్, ప్రకాశ్ రెడ్డి, చంద్రశేఖర్, యూత్ నాయకులు.. కార్తీక్, బొక్క దీక్షిత్ రెడ్డి మహిళలు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌తో ట్రాఫిక్ సమస్యకు చెక్

- కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి

సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న మహేశ్వర్ రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ): బోయిన్ పల్లి ప్రాంతంలో ట్రాఫిక్ ను తగ్గించే విధంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ను బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి జక్కుల మహేశ్వర్ రెడ్డి ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి రెండు ప్రతిపాదనలు సూచిస్తూ వినతి పత్రం అందజేశారు. ఎస్‌ఆర్ డీపీ కింద గతంలో ప్యారడైజ్ క్రాస్ రోడ్స్ నుంచి సుచిత్ర సర్కిల్, ఎన్ హెచ్ – 44లోని డైరీ ఫామ్ రోడ్డు వరకు ప్రతిపాదించబడిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం తో ట్రాఫిక్‌ను పెద్ద ఎత్తున తగ్గిస్తుందన్నారు. అదే విధంగా మొదట ప్రతిపాదిత వెడల్పును 200 అడుగుల నుంచి 150 అడుగులకు తగ్గించవచ్చని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం ఆరు లేన్ల రహదారిసరిపోతుందన్నారు. దీంతో పాటు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ చర్యల్లో భాగంగా బాలంరాయ్ ఎక్స్ రోడ్స్ వద్ద ఉన్న టన్నెల్ ప్రపోజ్, తాడ్‌బండ్ ముస్లిం శ్మశానవాటిక నుంచి చిన్న తోకట్ట, బోయిన్ పల్లి ఎక్స్‌రోడ్ల ద్వారా సుచిత్ర ఎక్స్ రోడ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అయితే సొరంగ మార్గాన్ని ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్ వరకు కొనసాగించి, ఆపై కుడి మలుపు తీసుకుంటే బోయిన్ పల్లి ఎక్స్– రోడ్లలో కలుస్తుందని చెప్పారు. దీని వల్ల చాలా ఆస్తులు, దేవాలయాలు, దర్గాలు, మసీదులను కోల్పోకుండా ఉండటంతో పాటు చిన్న తోకట్ట ప్రజలకు ఇవ్వాల్సిన పరిహార మొత్తాన్ని తగ్గించడంలో ఉపయోగ పడుతుందని స్పష్టం చేశారు. కారిడార్ నిర్మాణంలో భాగంగా గూగుల్ మ్యాప్ నమూనాను జతపరిచినట్లు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలి

సచివాలయ ముట్టడికి యత్నించిన పార్ట్‌టైం అధ్యాపకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

- సచివాలయం, గాంధీభవన్ ముట్టడికి పార్ట్‌టైం అధ్యాపకుల యత్నం
- పోలీసుల అడ్డగింత, అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. డిమాండ్ల సాధన కోసం సెక్రటేరియట్ ముట్టడికి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్సకళాశాల నుంచి వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.

సచివాలయం ముట్టడి ఉద్రిక్తం

ఖైరతాబాద్, ఏప్రిల్ 17: పార్ట్ టైం ఉద్యోగులు, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సచివాలయం ముట్టడికి యత్నించారు. పెద్ద ఎత్తున ఉద్యోగులు సచివాలయంలోకి చొచ్చుకువెళ్లేదుకు ప్రయత్నించగా, భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనేక మందిని అరెస్టు చేసి వివిధ పోలీసుల స్టేషన్లకు తరలించారు. పార్ట్ టైం ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

గాంధీభవన్ ముట్టడికి యత్నం..

అబిడ్స్ ఏప్రిల్ 17 : రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం గాంధీ భవన్ ముట్టకి యత్నించారు. ఈ క్రమంలో వారిని బేగం బజార్ పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ నాయకులు డాక్టర్ ఉపేందర్, డాక్టర్ విజేందర్ రెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, తెలంగాణ యూనివర్సిటీ నాయకులు డాక్టర్ కిషన్, డాక్టట్ నారాయణ గుప్తా, కిరణ్ రాథోడ్, పాలమూరు వర్సిటీ నాయకులు.. డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సోమేశ్, జేఎన్టీయూ అధ్యాపకులు సురేశ్ నాయక్, ఎస్ కుమార్, మారుతి మహిళా అధ్యాపకులు డాక్టర్ సునీత, డాక్టర్ సరిత, వినీత, రేష్మ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్కిన్సన్స్‌కు కిమ్స్‌లో శాశ్వత చికిత్స

సిటీబ్యూరో, ఏప్రిల్17,(నమస్తే తెలంగాణ): చేతులు, కాళ్లు విపరీతంగా వణికిపోతూ మనమీద మనకే నియంత్రణ లేకుండా చేసే పార్కిన్సన్స్ వ్యాధికి శస్త్ర చికిత్స లేకుండానే రోగం నయమయ్యేందుకు ఎంఆర్ గైడెడ్ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ (ఎంఆర్‌జీఎఫ్‌యూఎస్) చికిత్స అందుబాటులోకి వచ్చిందని, కేవలం మూడు నుంచి నాలుగు గంటల్లోనే వణుకుడు సమస్య పూర్తిగా మటుమాయం అయిపోతుందని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పార్కిన్సన్స్ వ్యాధి బాధితులు, వారి కుటుంబసభ్యులకు సమస్య, దాని లక్షణాలు, చికిత్స పద్దతులపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్స్ మూవ్‌మెంట్ డిజార్డర్స్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సుమారు 150 మంది రోగులు, వారి కుటుంబసభ్యులు హాజరై అనుమానాలను నివృత్తి చేసుకున్నారు.

వాహనదారులు.. జరభద్రం

- రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు
- ప్రత్యేక సిబ్బందితో తొలుత నోటీసులు, ఆపై వివరణకు అవకాశం
- తదనంతరం లైసెన్స్ రద్దునకు ప్రతిపాదన
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 820 లైసెన్స్‌లు రద్దుచేసిన ఆర్టీఏ

సిటీబ్యూరో,ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలో రోడ్డు నిబంధనలు పాటించకుండా బండి నడిపిన వారిపై వేటు పడనుంది. వారి లైసెన్స్‌లు రద్దు కానున్నాయి. రవాణాశాఖ(ఆర్టీఏ) ఈ మేరకు రద్దు ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించింది. ట్రాఫిక్ పోలీసుల నుంచి వచ్చే డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు ప్రక్రియను పర్యవేక్షించి.. త్వరితగతిన వాటిపై నిర్ణయం తీసుకోనున్నారు. రద్దు ప్రక్రియ న్యాయ నిబంధనలకు అనుగుణంగా చేయాల్సి ఉంటుంది. అందుకోసం కొంత సమయం పడుతుందని ఉన్నతాధికారులు చెప్పారు. ఇప్పటికే గ్రేటర్‌లో లైసెన్స్‌ల రద్దును అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఏడాది (మూడు నెలల్లో) ఇప్పటివరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలో 820 డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేశారు. గ్రేటర్‌లోని వివిధ పోలీసు స్టేషన్ల నుంచి లైసెన్స్‌ల రద్దు కోరుతూ వచ్చిన అనేక పిటిషన్లు ఆర్టీఏ అధికారుల వద్ద పరిశీలనకు ఉన్నాయి. సుమారు 1700 లైసెన్స్‌ల రద్దుకు ప్రతిపాదనలు వచ్చాయి.

తొలుత నోటీసులు.. ఆపై లైసెన్స్ రద్దు

నిబంధనల ప్రకారం తొలిసారి డ్రంకెన్ డ్రైవ్ పట్టుపడితే 3 నెలలు లైసెన్స్ రద్దు చేస్తున్నారు. రెండోసారి దొరికితే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయనున్నారు. అంతేకాదు మోటారు వాహనాల సవరణ చట్టం–2019 సెక్షన్ 206(4) ప్రకారం హెల్మెట్ లేకుండా బండి నడిపితే కూడా డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేసే వీలు ఉంది. అతివేగం, ఓవర్‌లోడ్, మరణాలకు కారణమయ్యే యాక్సిడెంట్లు చేయడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం తదితర వాటిలో డ్రైవింగ్ లైసెన్స్ రద్దు అవుతుంది. పోలీసుల నుంచి ఉల్లంఘనదారుడి వివరాలు రవాణాశాఖకు చేరుకుంటాయి. వారు పరిశీలించి సదరు వ్యక్తికి నోటీసులు పంపిస్తారు. పది రోజుల్లో అతడు తన వివరణను ఇస్తాడు. అనంతరం రవాణ శాఖ అధికారుల నిర్ణయం మేరకు లైసెన్స్ రద్దు ప్రక్రియ జరుగుతుంది. కోర్టు నిబంధనల ప్రకారం వాహనదారుడికి నోటీసులు పంపకుండా లైసెన్స్ రద్దు చేయడం కుదరదు. అందులో భాగంగానే ఈ ప్రక్రియ కొంత ఆలస్యం అవుతుందని అధికారులు తెలిపారు.

క్రమశిక్షణ పాటిద్దాం..

రోడ్డు ప్రమాదాలు, నిబంధనలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా కొంతమంది ర్యాష్ డ్రైవింగ్, అతివేగంతో ఇతరుల ప్రాణాలను బలిగొంటున్నారు. కుటుంబ సభ్యులకు తీరని వ్యథను మిగులుస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌ల్లో చాలామంది పట్టుబడుతున్నారు. ఇలా నిబంధనలు అతిక్రమించే వారి సంఖ్య పెరగుతుండటంతో రవాణా శాఖ అధికారులు రద్దు ప్రక్రియను చాలా సీరియస్‌గా తీసుకున్నారు. తరుచూ ప్రమాదాలకు కారణమయ్యే వారి లైసెన్స్‌లు శాశ్వతంగా రద్దు చేస్తున్నారు. అందుకే వాహనదారులూ జర భద్రం.